డైమండ్ హిల్స్‌లో విద్యుత్ అధికారుల 'ప్రజాబాట'



కార్యక్రమంలో పాల్గొన్న జీఎం అంజయ్య, ఇతర ఉద్యోగులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మీకు సమస్య ఏమైనా ఉందా? మాకు చెప్తే పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని టీజీఎస్‌పీడీసీఎల్ ఆర్‌ఆర్ జోన్ జీఎం అంజయ్య అన్నారు. ఈ మేరకు వసంతనగర్ సెక్షన్ పరిధిలోని డైమండ్ హిల్స్‌లో మంగళవారం ప్రజాబాట నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో సమావేశమై విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే చెప్పాలని సూచించారు. అనంతరం అక్కడి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఈ ఆదినారాయణ, ఏఈ వాణి, ఎస్ఎల్ఐ రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా పార్క్ చేసిన వాహనాలకు ఫైన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌తో ఇబ్బందులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఎస్‌హెచ్‌వో జానయ్య క్షేత్రస్థాయిలో పర్యటించారు. రమ్య గ్రౌండ్, వార్డు కార్యాలయం మార్గాల్లో పార్కింగ్ చేసిన వాహనాలకు చలాన్లు విధించారు. అయితే అసలు సమస్యను వదిలేసి వివిధ పనుల కోసం వచ్చి వాహనాలను నిలిపిన వారిపై చర్యలు తీసుకోవడం ఏంటని పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వాహనాలను నిలపడానికే స్థలం లేదని, ఇక వీటిని తీసుకెళ్లి ఎక్కడ పెట్టాలన్నారు. అందుకే చలాన్లు విధిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు సహకరించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

కుంగిన మ్యాన్‌హోల్స్..



కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లో మ్యాన్‌హోల్స్ రోడ్డు కంటే కిందకు కుంగిపోయాయి. నిర్మాణాలకు సామగ్రితో వచ్చే హెవీ వెహికల్స్‌తో ఇలా అయ్యాయని స్థానికులు అంటున్నారు. కొత్తవారు ఈ మార్గంలో వస్తే మ్యాన్‌హోల్స్ గుంతల్లో పడి ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

ఓటింగ్ సరళిని పరిశీలించిన బండి రమేశ్

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ మంగళవారం జరిగిన ఓటింగ్ సరళిని పరిశీలించారు. వెంగళరావునగర్, మధురానగర్‌లో బూత్ ఏజెంట్లు, ఓటరు స్లిప్పులు అందించే వారితో మాట్లాడారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని వారికి సూచించారు.

అర్ధరాత్రి రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్

- యువకుల పరస్పర దాడి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో గ్యాంగ్ లీడర్



రాజీవ్‌గృహకల్పలో గంజాయి మత్తులో ఘర్షణ పడుతున్న యువకులు



గాయపడ్డ తరుణ్‌నాయక్



నిందితుడు తిలక్

నిజాంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలో సోమవారం అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. ఆటోలో వస్తున్న ఇద్దరిపై దాడి చేసి తలలు పగుల గొట్టింది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం...సోమవారం రాత్రి 11 గంటలకు తరుణ్ నాయక్, సీతారామ్ నాయక్‌లు ఆటో నడుపుకుంటూ తమ ఇంటికి వస్తుండగా, అప్పటికే గంజాయి, మద్యం తాగి మత్తులో ఉన్న తిలక్‌తో పాటు అతని గ్యాంగ్ సభ్యులు ముగ్గురు ఆటోను ఆపారు. మమ్మల్నే పక్కకు పొమ్మటారా అంటూ దాడికి దిగారు. ఎదురు దాడి చేసి తరుణ్ నాయక్, సీతారామ్ నాయక్‌తలలను పగులగొట్టారు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు తిలక్‌ను అదుపులోకి తీసుకొని, అతడికి సహకరించిన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న గ్యాంగ్

రాజీవ్‌గృహకల్పలో 80వ బ్లాక్ మొదలుకొని అన్ని బ్లాక్‌లకు తిలక్ అనే వ్యక్తికి సంబంధించిన గ్యాంగ్ సభ్యులు రాత్రి వేళల్లో గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. ఎవరైనా అడ్డు చెబితే నీ అంతు చేస్తామని, ఇళ్లలోకి వచ్చి కొడతామని బెదిరిస్తున్నారని, వీరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు రామచంద్రనాయక్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వీరి బెదిరింపులతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని జీవిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్న, చిన్న యువకులను బెదించి గంజాయి అలవాటు చేయిస్తున్నారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే మున్ముందు కాలనీలో ప్రజలు నివసించేందుకు కష్టతరమవుతుందని రామచంద్రనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించి, స్థానికులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్ట్

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఐదుగురు విదేశీయులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్ సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ తనిఖీ చేయగా విదేశీయులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. లైబేరియా దేశానికి చెందిన డేరియస్ (28) 2021లో విద్యాభ్యాసం నిమిత్తం భారతదేశానికి వచ్చాడు. సుభాష్ చంద్రబోస్ నగర్‌లో ఉంటూ ఓ కళాశాలలో చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విద్యనభ్యసిస్తున్నాడు. ఇతడితో పాటు కెన్యా దేశానికి చెందిన ఇద్దరు మహిళలు, ఉగాండా దేశానికి చెందిన మరో మహిళతో వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను అరెస్టు చేసి మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.4 వేలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించగా, డేరియస్ ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్‌లో విజయానికి అల్లాపూర్ నాయకుల కృషి

అల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా గత పదిహేను రోజులుగా అల్లాపూర్ డివిజన్‌కు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణులు శ్రమించాయి. కార్యకర్తలు, నేతలు తమ పార్టీ అభ్యర్థులను గెలుపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. అల్లాపూర్‌తో పాటు మూసాపేట్ డివిజన్‌కు చెందిన కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. బీఆర్ఎస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగుల సత్యం, కాంగ్రెస్ సీనియర్ నేత దేవరింటి మస్తాన్ రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ సహా అనేక మంది ప్రచార పర్వం నుంచి పోలింగ్ డే వరకు తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమించారు.

అందెశ్రీకి హెచ్‌సీయూ తెలుగు శాఖ నివాళి



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పిల్లమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు తదితరులు

రాయదుర్గం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గీతం రచించిన అందెశ్రీ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు పిల్లమర్రి రాములు వ్యాఖ్యానించారు. మంగళవారం యూనివర్సిటీలోని తెలుగు శాఖ కార్యాలయంలో రాములు అధ్యక్షతన సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగు శాఖ అధ్యాపకులంతా పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే గేయ రచన ద్వారా మనుషుల్లోని మానవత్వాన్ని తట్టి లేపిన ఉత్తమ గేయ రచయిత అందెశ్రీ అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. ఎంతో ప్రతిభావంతుడైన అందెశ్రీకి ఆరోగ్యం సహకరించి ఉంటే ఎన్నో ఉత్తమ గేయాలు రచించి ఉండేవారని ఆచార్య గోనా నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య పమ్మి పవన్‌కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య వారిజారాణి, ఆచార్య త్రివేణి వంగర తదితరులు పాల్గొన్నారు.

పగలూ వీధి దీపాల వెలుగులు



హస్మత్‌పేట సమీపంలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

కూకట్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని చాలా కాలనీల్లో పట్టపగలు కూడా వీధి లైట్లు వెలుగుతున్నాయి. కూకట్‌పల్లి, మూసాపేట, బాలానగర్, ఓల్డ్ బోయినపల్లిలోని పలు కాలనీలలో ఈ పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు కొన్ని చోట్ల చర్యలు తీసుకున్నప్పటికీ అన్ని కాలనీల్లో సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యను గుర్తించి విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుణాత్మక విద్యాభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ కృషి

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో గుణాత్మక విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలాజీ విభాగం ఆచార్యులు తాళ్ల సుమాలిని అన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ పరిధిలోని గచ్చిబౌలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమాలిని అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. నేటికీ చాలా మంది విద్యకు దూరంగా ఉన్నారని, వారందరికీ విద్యను చేరువ చేసేలా ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు కృషి చేయాలని ఆమె కోరారు.

మూడేళ్లయినా మారని చిరునామా..!

- ఫిరోజ్‌గూడ వార్డు కమ్యూనిటీహాల్‌కు మారిన సివిల్ సప్లయ్ కార్యాలయం
- ఇంటర్‌నెట్‌లో కొత్త అడ్రస్‌ను అప్డేట్ చేయని అధికారులు
- పాత అడ్రస్‌కు వెళ్లి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కూకట్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్‌కార్డుల ఇస్తామని చెప్పడంతో ప్రజలలో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. గత కొన్నేళ్లుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూసిన ప్రజలు దరఖాస్తుల కోసం ఎగబడ్డారు. మీసేవలో దరఖాస్తు చేసిన అనంతరం అప్డేట్ కోసం సివిల్ సప్లై కార్యాలయానికి క్యూ కట్టారు. కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని ప్రజలు తమకు నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయా లేదా అని తెలుసుకునేందుకు నిత్యం ఎంతోమంది సివిల్ సప్లై కార్యాలయానికి వస్తున్నారు. అయితే చాలా మంది ఇంటర్‌నెట్‌లో ఉన్న చిరునామాకు వెళ్తున్నారు. గూగుల్ మ్యాప్‌లో బాలానగర్ ఏఎస్‌వో కార్యాలయం బాలానగర్ చౌరస్తా సమీపంలో ఉన్న పాత అడ్రస్‌లో కనిపిస్తుండటంతో జనాలు అక్కడికి వెళ్లి ఆరా తీస్తుండటంతో అక్కడి స్థానికులు బాలానగర్ ఫిరోజ్‌గూడ వార్డ్ కమ్యూనిటీహాల్‌కు మారినట్లు సమాచారం ఇస్తున్నారు. దీంతో వారు ఉసూరుమంటూ తిరిగి కొత్త అడ్రస్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీనిపై జనాలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏఎస్‌వో కార్యాలయం చిరునామా మారి మూడేళ్లయినా అధికారులు గూగుల్ మ్యాప్‌లో మార్చకపోవడంపై మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా అప్డేట్ కావాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో చిరునామా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పించిన పిల్లమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు తదితరులు

అందెశ్రీకి హెచ్‌సీయూ తెలుగు శాఖ నివాళి

రాయదుర్గం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గీతం రచించిన అందెశ్రీ మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు పిల్లమర్రి రాములు వ్యాఖ్యానించారు. మంగళవారం యూనివర్సిటీలోని తెలుగు శాఖ కార్యాలయంలో రాములు అధ్యక్షతన సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగు శాఖ అధ్యాపకులంతా పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే గేయ రచన ద్వారా మనుషుల్లోని మానవత్వాన్ని తట్టి లేపిన ఉత్తమ గేయ రచయిత అందెశ్రీ అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. ఎంతో ప్రతిభావంతుడైన అందెశ్రీకి ఆరోగ్యం సహకరించి ఉంటే ఎన్నో ఉత్తమ గేయాలు రచించి ఉండేవారని ఆచార్య గోనా నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య పమ్మి పవన్‌కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య వారిజారాణి, ఆచార్య త్రివేణి వంగర తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యులు సుమాలిని

గుణాత్మక విద్యాభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ కృషి

గచ్చిబౌలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో గుణాత్మక విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ విభాగం ఆచార్యులు తాళ్ల సుమాలిని అన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ పరిధిలోని గచ్చిబౌలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమాలిని అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా పని చేసిన ఆయన విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. నేటికీ చాలా మంది విద్యకు దూరంగా ఉన్నారని, వారందరికీ విద్యను చేరువ చేసేలా ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు కృషి చేయాలని ఆమె కోరారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

చందానగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ కేవ్ ఎఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు భిక్ష వితరణ చేశారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సతీమణి శ్యామలాదేవి, కుటుంబ సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రోడ్లపై మురుగు.. ఇబ్బందుల్లో ప్రజలు

- గచ్చిబౌలి డివిజన్‌లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- ఖాజాగూడలో రహదారులపై పారుతున్న మురుగు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు





ఖాజాగూడలో రోడ్లపై ఉన్న మురుగు నీరు

రాయదుర్గం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఖాజాగూడ గ్రామంలోని ప్రధాన రహదారిపైన రెండు నెలలుగా మురుగు నీరు రోడ్డుపై పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల టైర్ల ద్వారా పైకి ఎగసిపడుతున్న మురుగునీరు ద్విచక్రవాహనదారులపై, నడిచి వెళ్లే వారిపై పడుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని వారు చెబుతున్నారు. కార్తీక మాసం కావడంతో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్తుంటారు. నిష్ఠగా పూజలు, వ్రతాలు చేసుకునే వారిపై మురుగు పడుతుండటంతో అసౌకర్యంగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటి ప్రవాహాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి

ఖాజాగూడ గ్రామంలో రెండు నెలల నుంచి మురుగు నీరు రోడ్డు పై పారుతోంది. దీంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- రమేష్‌గౌడ్, మధురానగర్

సమస్య పరిష్కారానికి చర్యలు

గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. ఖాజాగూడలో మురుగు నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తాం.

- గంగాధర్ రెడ్డి, గచ్చిబౌలి కార్పొరేటర్

విదేశీ యువతులతో వ్యభిచారం

- వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్ట్

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఐదుగురు విదేశీయులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్ సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ తనిఖీ చేయగా విదేశీయులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. లైబేరియా దేశానికి చెందిన డేరియస్ (28) 2021లో విద్యాభ్యాసం నిమిత్తం భారతదేశానికి వచ్చాడు. సుభాష్ చంద్రబోస్ నగర్‌లో ఉంటూ ఓ కళాశాలలో చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విద్యనభ్యసిస్తున్నాడు. ఇతడితో పాటు కెన్యా దేశానికి చెందిన ఇద్దరు మహిళలు, ఉగాండా దేశానికి చెందిన మరో మహిళతో వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను అరెస్టు చేసి మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.4 వేలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించగా, డేరియస్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామేశ్వరరావు, ఫ్యాకల్టీ

ఎస్కీలో 19న ఏఐ అండ్ డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్

రాయదుర్గం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో ఈ నెల 19న కాలేజ్ క్యాంపస్‌లో ఏఐ అండ్ డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. హ్యాకథాన్ థీమ్స్‌లో ప్రధానంగా ఏఐ, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా, అనలిటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, స్మార్ట్ సిటీస్ అండ్ సస్టైనబిలిటీ, సైబర్ సెక్యూరిటీ అండ్ బ్లాక్ చైన్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫర్ సోషల్ గుడ్ అనేవి ఉంటాయని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. పాల్గొనదలచిన ఇంజనీరింగ్, సైన్స్ విద్యార్థులు ఈ నెల 15 లోపు తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.



రేగులకుంట రహదారిలో చెత్త తొలగించి శుభ్రం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టపై చెత్త శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురించిన వార్త కథనానికి అధికారులు స్పందించారు. మియపూర్ దీప్తిశ్రీనగర్ రేగులకుంట చెరువు కట్ట పక్కన ఉన్న చెత్తను శానిటేషన్ సిబ్బంది తొలగించారు. చెత్త వేస్తున్న చెత్త బండ్ల యజమానులకు జరిమానా విధించిన అధికారులు, ఇకపై ఇక్కడ చెత్త డంప్ చేయవద్దని హెచ్చరించారు.



టిఫిన్ సెంటర్ సామగ్రిని బయట పడేస్తున్న సిబ్బంది

షీ టాయిలెట్ కంటైనర్ సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మియాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'టిఫిన్ సెంటర్‌గా మారిన షీ టాయిలెట్' పేరుతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. మియాపూర్ మైత్రి కమాన్ పక్కన ఉన్న షీ టాయిలెట్ కంటైనర్‌లో నడుస్తున్న టిఫెన్ సెంటర్ సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌కు తాళం వేసి సీజ్ చేశారు.

ఇళ్ల ముంగిట మురుగు పరుగు

హైటెక్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని హరిజన బస్తీవాసుల ఇళ్ల ముంగిట మురుగు పరుగు తీస్తుంది. పైనుంచి డ్రైనేజీ ద్వారా వస్తున్న మురుగు నీరు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వచ్చి ఇళ్ల ముందు ప్రవహిస్తున్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటి అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాంతో డ్రైనేజీ నుంచి మురుగు సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న మెట్రోపిల్లర్ నంబరు సి1737 వరకు ప్రవహిస్తుంది. అధికారులు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజులరామారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 132 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. చంద్రగిరినగర్ చౌ రస్తా,అంబేడ్కర్‌నగర్, ఉమాదేవినగర్, జనని స్కూల్ లైన్, చంద్రగిరినగర్ దర్గా లైన్, బాలాజీ స్కూల్ లైన్ , పీపీనగర్, మసీద్‌లైన్, జహంగీర్ బస్తీ, ఇందిరానగర్-బి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గుర్తింపు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

● యూఎస్ఎఫ్ఐ



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

షాపూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా పదో తరగతి అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఏడీ లింగనాథంకు మంగళవారం యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బ్యాగరి వెంకటేష్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు 10వ తరగతి పర్మిషన్ లేకుండా అక్రమంగా విద్యార్థులను చేర్చుకొని తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్, నాయకులు కృషి, కీర్తన, నవదీప్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ వరం

షాపూర్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలా మారిందని కేకేఎం ట్రస్ట్ చైర్మన్, కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కొండా సుజాత, ఎరగాం దండ్ల వంశీ, రెడ్డి సత్యనారాయణ, నీరుడు ఓంప్రకాష్, మార్గం శంకర్, కొట్టె సులోచనలు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సపొందారు. పేదలైన వీరు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ కలిపి రూ. 3 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించి ఎల్ఓసీ పత్రాలను మంగళవారం షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో దూలపల్లి మాజీ కౌన్సిలర్ బైరి శివకుమార్‌గౌడ్, చైడ శ్రీనివాస్, నాగిళ్ళ శ్రీనివాస్, బాలప్ప, యాం సాగర్, ఉలిపి శ్యామ్, అరుణ్ కుమార్, రఘుగౌడ్, సంపత్, కృష్ణ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం

సూరారంకాలనీ లూయిస్ బ్రెయిలీ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో యాంటీకరప్షన్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇన్నారెడ్డి, ఉప్పు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

-(జీడిమెట్ల - ఆంధ్రజ్యోతి)

రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్

● యువకుల పరస్పరం దాడి
● ఇద్దరి తలలకు తీవ్రగాయాలు
● పోలీసుల అదుపులో గ్యాంగ్ లీడర్



గాయపడ్డ తరుణ్‌నాయక్



నిందితుడు తిలక్



రాజీవ్‌గృహకల్పలో గంజాయి మత్తులో ఘర్షణ పడుతున్న యువకులు

నిజాంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలో సోమవారం అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. ఆటోలో వస్తున్న ఇద్దరిపై దాడి చేసి తలలు పగులగొట్టింది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం...సోమవారం రాత్రి 11 గంటలకు తరుణ్ నాయక్, సీతారామ్ నాయక్‌లు ఆటో నడుపుకుంటూ తమ ఇంటికి వస్తుండగా, అప్పటికే గంజాయి, మద్యం తాగి మత్తులో ఉన్న తిలక్‌తో పాటు అతని గ్యాంగ్ సభ్యులు ముగ్గురు ఆటోను ఆపారు. మమ్మల్నే పక్కకు పొమ్మంటారా అంటూ దాడికి దిగారు. ఎదురు దాడి చేసిన తరుణ్ నాయక్, సీతారామ్ నాయక్ తలలను పగులగొట్టారు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు తిలక్‌ను అదుపులోకి తీసుకొని, అతడికి సహకరించిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న గ్యాంగ్

రాజీవ్‌గృహకల్పలో 80వ బ్లాక్ మొదలుకొని అన్ని బ్లాక్‌లకు తిలక్ అనే వ్యక్తికి సంబంధించిన గ్యాంగ్ సభ్యులు రాత్రి వేళల్లో గంజాయి విక్రయించడంతో పాటు సేవిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. ఎవరైనా అడ్డు చెబితే నీ అంతు చేస్తామని, ఇళ్లలోకి వచ్చి కొడతామని బెదిరిస్తున్నారని, వీరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు రామచంద్రనాయక్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వీరి బెదిరింపులతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని జీవిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్న, చిన్న యువకులను బెదించి గంజాయి అలవాటు చేయిస్తున్నారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే మున్ముందు కాలనీలో ప్రజలు నివసించేందుకు కష్టతరమవుతుందని రామచంద్రనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించి, స్థానికులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.



రాజీవ్‌గృహకల్పలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నాణ్యత లేని సీసీ రోడ్డు పనులు

● కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం ధర్నా

నిజాంపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ సభ్యులు మంగళవారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, రాజీవ్‌గృహకల్ప 31వ బ్లాక్ నుంచి సాయిబాబా గుడి వరకు సీసీ రోడ్డు వేసి నాలుగు రోజులు అవుతున్నా క్యూరింగ్ కోసం ఒక్క చుక్క నీళ్లు పోయలేదన్నారు.

ఇలా నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మిస్తే, మూడు రోజులకే ధ్వంసమై పోతుంది కదా? 5 వేల లీటర్ల ట్యాంకర్ రోడ్డుపైకి వెళ్లినా సీసీ రోడ్డు ధ్వంసమయ్యే అవకాశం ఉందని, కాంట్రాక్టర్‌ను ఎవరైనా రోడ్డుపై నీళ్లు పెట్టవా? అని అడిగితే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయంపై మున్సిపల్ అధికారుల ప్రత్యేక దృష్టి సారించి కాంట్రాక్టర్ చేస్తున్న పనులను పర్యవేక్షించి, నాణ్యతో పనులు జరిగేలా చూడాలని, నాణ్యత లేని పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.



పాల్గొన్న భక్తులు

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ బతుకమ్మ బండలోని ఆంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరి పంతులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి నవగ్రహ, దత్తాత్రేయ స్వామి ఆరాధన, రక్షాబంధన్ అగ్నిప్రతిష్ఠ, శివ పార్వతి పల్లకి సేవ భక్తులు నిర్వహించారు.

-(గాజులరామారం-ఆంధ్రజ్యోతి)

గంజాయిపై గళమెత్తిన 'గుట్ట' ప్రజలు

● విక్రేతలు, సేవించే వారికి అద్దెకు ఇల్లు ఇవ్వకూడదని నిర్ణయం
● ఒక్కసారి పట్టుబడితే బస్తీ నుంచి బహిష్కరణ



సమావేశంలో పాల్గొన్న నాయకులు, బస్తీల ప్రజలు

జీడిమెట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి లేని సమాజాన్ని నిర్మిద్దామని జగద్గిరిగుట్ట ప్రజలు గళమెత్తారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. గంజాయి ప్రభావంతో ఎంతో మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని జగద్గిరిగుట్టలో గంజాయి విక్రయించాలనుకునే వారికి, సేవించే వారికి ఇల్లు అద్దెకు ఇవ్వరాదని నిర్ణయించారు. గంజాయి కేసులో ఒక్కసారి పట్టుబడితే ఈ ప్రాంతం నుంచి బహిష్కరించాలని, అన్ని బస్తీల్లో గంజాయి వ్యతిరేక కమిటీలు వేసి, ప్రజలను చైతన్యం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అన్ని రాజకీయ పార్టీలు, బస్తీ కమిటీలతో ఈనెల 14న బాలల దినోత్సవం రోజున వేలాది మందితో మానవహారం ఏర్పాటు చేయా లని గంజాయి వ్యతిరేక కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో నాయకులు ప్రవీణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ సీనియర్ నాయకుడు ఏసురత్నం, స్వామి, హరినాథ్, రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్, సాయిపంతులు, పవన్‌రెడ్డి, జనసేన సతీష్, బీజేపీ నాయకులు హనుమంతు, చారి, రాజుయాదవ్, బాబు, అసిస్టెట్ ప్రొఫెసర్ త్రివేణి పాల్గొన్నారు.

ముగిసిన నవగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



భక్తుల శ్లోకాలను వివరిస్తున్న గరికపాటి నర్సింహారావు

కుత్బుల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ మాణిక్యనగర్‌లోని శ్రీకామాక్షి సమేత ఏకాంమ్రనాథ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న నవగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన ముగింపు ఉత్సవాలకు మహాసహస్రావధాని గరికపాటి నర్సింహారావు హాజరయ్యారు. కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పూజలు చేశారు. మహాభారతంతో పాటు పలు శ్లోకాలను భక్తులకు క్లుప్తంగా వివరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న మురుగు (ఫైల్)



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

కుత్బుల్లాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పద్మానగర్ ఫేజ్-2 రింగురోడ్డు సమీపంలో నెలల తరబడి మురుగునీరు లీకవుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో ఈనెల7న ఆంధ్రజ్యోతిలో 'మురుగునీటి లీకేజీలతో ఇబ్బందులు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం సదరు మ్యాన్‌హోల్‌కు మరమ్మతు పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.